సాక్షి
పశ్చిమగోదావరి
సోమవారం । 27 । మార్చి । 2023



పాత్ర ఏదైనా.. మెచ్చేలా నటన

రంగస్థలానికి క్షీరపురి ప్రసిద్ధి. ఇక్కడి కళాకారులెందరో చిత్రసీమలోనూ రాణించారు. ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం. 8లో



ముంచుకొస్తున్న రెన్యువల్ గడువు

ప్రైవేట్ ఆస్పత్రులు, ల్యాబ్‌లు, క్లినిక్‌ల రిజిస్ట్రేషన్ రెన్యువల్ గడువు నెలాఖరుతో ముగియనుంది. ఆయా సంస్థలు తప్పనిసరిగా రెన్యువల్ చేయించుకోవాలి. 8లో



వనదేవతకు వందనం

బుట్టాయగూడెం: కామవరం అటవీ ప్రాంతంలో కొలువైన గుబ్బల మంగమ్మ దర్శనానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ప్రత్యేక పూజలు చేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ సోమవారం సాయంత్రం	సహరి మంగళవారం వేకువజాము
భీమవరం	6.23	4.42
తాడేపల్లిగూడెం	6.25	4.50
నరసాపురం	6.22	4.40

ఉద్యానానికి ఉపాధి ఊతం

డ్రైల్యాండ్ హార్టీకల్చర్ పథకం

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అమలు
- అడిగిన వారందరికీ అందించేలా చర్యలు
- వచ్చేనెల నుంచి దరఖాస్తుల స్వీకరణ
- మే నెలలో కందకాల తవ్వకాలు



ఉపాధి హామీ పథకం ద్వారా సాగవుతున్న ఉద్యాన పంటలు

ఏలూరు(మెట్రో) : అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పంటలోనూ రైతులకు మేలు జరిగేలా సంకల్పించింది. దీనిలో భాగంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా ఉద్యాన పంటల సాగుకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా లబ్ధి చేకూర్చేలా చర్యలు తీసుకుంది. ఉమ్మడి జిల్లాలో 1.80 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు ఉండగా 'ఉపాధి' పథకం ద్వారా ప్రోత్సాహం అందించేలా సన్నాహాలు చేస్తోంది.

ఐదెకరాల్లోపు..

ఉపాధి హామీ పథకం ద్వారా అరెకరం నుంచి ఐదు ఎకరాలలోపు భూములున్న రైతుల నుంచి డ్రై ల్యాండ్ హార్టీకల్చర్ పథకం కింద దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. వచ్చేనెల 1వ తేదీ నుంచి మొదలు కానున్న ఈ పథకం ద్వారా పండ్ల తోటలు, పూలసాగుకు చర్యలు తీసుకుని రైతులకు అదనపు ఆదాయం వచ్చేలా ఏర్పాట్లు చేస్తోంది. అలాగే ప్రస్తుతం ఉన్న పండ్ల తోటల్లోనూ అంతర్ పంటలు సాగు చేసుకునేలా వెసులుబాటు కల్పించనుంది.

పంట చేతికి వచ్చే వరకూ..

ఉపాధి హామీ పథకం ద్వారా సాగు చేసే పంటలు చేతికి వచ్చే వరకూ ప్రభుత్వం సాయం అందిస్తుంది. రైతు దుక్కి దున్నేందుకు, కందకాలు తీసుకునేందుకు, మొక్కల కొనుగోలు, నాటడం వంటి పనులకు తోడ్పాటు అందిస్తుంది. అంతర్ పంటలుగా పూల సాగు చేస్తే ఏడాది పొడవునా రైతుకు ఆదాయం సమకూర్చేలా చర్యలు తీసుకుంటోంది.

ఎకరాకు రూ.లక్ష

ఉపాధి హామీ డ్రైల్యాండ్ హార్టీకల్చర్‌లో భాగంగా నేల స్వభావాన్ని బట్టి రైతులకు మామిడి, చీని, నిమ్మ, దానిమ్మ, జామ, తైవాన్ జామ, సపోటా, చింత, నేరేడు, కొబ్బరి, సీతాఫలం, యాపిల్‌బేర్, డ్రాగన్‌ఫ్రూట్, గులాబీ, మల్లె, మునగ పంటల సాగు కోసం రైతు నుంచి దరఖాస్తులు ఆహ్వానించనున్నారు. గుంతలు తవ్వే దగ్గర నుంచి మొక్కలతో పాటు పురుగు మందుల వరకు సుమారు ఎకరాకు రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు ప్రభుత్వం వెచ్చించనుంది. దీంతో పాటు అదనంగా మూడేళ్ల పాటు మొక్కలకు నీటిని సైతం పెట్టి సంరక్షించేందుకు రైతుకు బిల్లులు అందిస్తారు.

రైతులను ప్రోత్సహించేలా..



రైతులను ప్రోత్సహించేందుకు, ఖర్చు లేకుండా ఆదాయాన్ని సమకూర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఉపాధి హామీ పథకం ద్వారా అడిగిన ప్రతిఒక్క రైతుకు డ్రైల్యాండ్ హార్టీకల్చర్ ద్వారా ఉద్యాన పంటలు పండించేలా చర్యలు తీసుకుంది. వచ్చేనెల మొదటి వారం నుంచి రైతులు ఎంపీడీఓ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. అరెకరం నుంచి ఐదెకరాల వరకు ఉద్యాన పంటలు సాగు చేసుకోవచ్చు.

– డి.రాంబాబు, డ్వామా పీడీ, ఏలూరు జిల్లా

మరింత మందికి మేలు



ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉద్యాన పంటలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఉపాధి హామీ పథకం ద్వారా ఉద్యాన పంటలకు తోడ్పాటు అందిస్తోంది. జిల్లావ్యాప్తంగా 1.80 లక్షల ఎకరాలకు పైబడి ఉద్యాన పంటలు ఉన్నాయి. ఉపాధి హామీ పథకం ద్వారా మరింత మంది రైతులను ప్రోత్సహించడం ద్వారా వేలాది ఎకరాల ఉద్యాన పంటలు సాగయ్యే అవకాశం ఉంది.

– పీపీఎస్ రవికుమార్, జిల్లా ఉద్యానశాఖ అధికారి, ఏలూరు జిల్లా

పాడి పశువుల ఆరోగ్య పరిరక్షణ

- ముమ్మరంగా గాలికుంటు టీకాలు
- ఇప్పటివరకూ 3 వేల పశువులకు పూర్తి
- వచ్చేనెల 24 వరకు కార్యక్రమం



నరసాపురం మండలం లక్ష్మణేశ్వరంలో గేదెకు టీకా వేస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): పాడి పశువుల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా పశుసంవర్ధకశాఖ అధికారులు ఆవులు, గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నారు. పశు వైద్యులు, సిబ్బంది గ్రామాల్లో పశు స్థావరాల వద్దకు వెళ్లి ఉచితంగా టీకాలు వేసే కార్యక్రమం చేపట్టారు. ఈనెల 25న ఈ కార్యక్రమం ప్రారంభం కాగా వచ్చేనెల 24వ తేదీ వరకూ నిర్వహించనున్నారు. రెండు రోజుల్లో జిల్లావ్యాప్తంగా సుమారు 3 వేల పశువులకు టీకాలు వేశారు. పాడి రైతులంతా తప్పనిసరిగా పశువులకు టీకాలు వేయించాలని అధికారులు సూచించారు. గాలికుంటును నిర్లక్ష్యం చేసే ఇబ్బందులు తప్పవన్నారు.

జిల్లాలో 2.16 లక్షల పశువులు

జిల్లాలో భీమవరం, తాడేపల్లిగూడెం పశుసంవర్ధకశాఖ డివిజన్లు ఉన్నాయి. ఆకివీడు, కాళ్ల, భీమవరం, వీరవాసరం, నరసాపురం, పాలకొల్లు, ఉండి, పాలకోడేరు, యలమంచిలి, మొగల్తూరు మండలాలు భీమవరం డివిజన్‌లోకి వస్తాయి. తాడేపల్లిగూడెం, పెంటపాడు, పెనుగొండ, పెనుమంట్ర, తణుకు, ఇరగవరం, అత్తిలి, పోడూరు మండలాలు తాడేపల్లిగూడెం డివిజన్ పరిధిలో ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా అధికారుల లెక్కల ప్రకారం 1,72,105 గేదెలు, 44,597 ఆవులు ఉన్నాయి.

ఉచితంగా టీకా



పాడి రైతులు పశువులకు గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలి. వీటిని ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. ముందస్తుగా టీకాలు పశువులకు వేయడం వల్ల గాలికుంటు వ్యాధి రాదు. వచ్చేనెల 24 వరకు కార్యక్రమం నిర్వహిస్తాం. పశువుల వద్దకే వచ్చి వైద్యులు, వెటర్నరీ సిబ్బంది టీకాలు వేస్తారు.

– డాక్టర్ మురళీకృష్ణ, పశుసంవర్ధక శాఖ అధికారి, భీమవరం

మహిళా సాధికారత సీఎం జగన్‌తోనే సాధ్యం

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



తాడేపల్లిగూడెంలో వైఎస్సార్ ఆసరా చెక్కు అందిస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: రాష్ట్రంలో మహిళా సాధికారత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే సాధ్యమైందని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. స్థానిక మాగంటి కల్యాణ మండపంలో ఆదివారం వైఎస్సార్ ఆసరా మూడో విడత కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ పరిధిలోని 1,036 డ్వాక్రా సంఘాల్లోని 9,430 మంది మహిళలకు రూ.8,00,31,277 చెక్కు అందజేశామన్నారు. 2014కు ముందు చంద్రబాబు డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేస్తానని చెప్పి మోసం చేశారని విమర్శించారు. ఉమ్మడి రాజధాని పదేళ్లపాటు హైదరాబాద్‌లో ఉండగా చంద్రబాబు ఓటుకు నోటు కేసుకు భయపడి అటువైపు వెళ్లలేదన్నారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో రూ.10 కోట్లు ఆఫర్ చేయడం చంద్రబాబు నీచ రాజకీయాలకు నిదర్శనమన్నారు. సీఎం జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీ ప్రకారం డ్వాక్రా రుణాలను నాలుగు విడతలుగా మాఫీ చేస్తానని చెప్పి, ఇప్పటికే మూడు విడతలు అమలు చేశారన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు ఆర్థిక సమృద్ధి సాధిస్తున్నారన్నారు. రాష్ట్రంలో 31.60 లక్షల మందికి ఇళ్ల స్థలాలను అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదే అన్నారు. సీఎం జగన్ నాయకత్వాన్ని రాబోయే రోజుల్లో తిరిగి నిలబెట్టుకోవాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. అనంతరం సీఎం జగన్, మంత్రి కొట్టు చిత్రాపటాలకు డ్వాక్రా మహిళలు క్షీరాభిషేకం చేశారు.



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

ఆర్డీఓ దాసి రాజు, మున్సిపల్ కమిషనర్ బి.బాలస్వామి, మున్సిపల్ ఇంజినీర్ మురళీకృష్ణ, నాయకులు సంపత్‌కుమార్, కొలుకూరి ధర్మరాజు, వెలనాటి సత్తిబాబు, తాళ్లూరి మురళి, బోళం రమణ, బొద్దాని శ్రీనివాసు, బోళం రామలక్ష్మి, బోణం విజయనిర్మల, కర్రి సుధాకర్‌రెడ్డి, చింతా శ్రీనివాసు, సంపత్‌రావు కృష్ణారావు, రాజా త్రినాథ్, మానికొండ వెంకటేశ్వరరావు, చామన సూర్యచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

లక్ష్యంతో ముందుకు సాగాలి



ప్రశ్నపత్రాన్ని విడుదల చేస్తున్న సబ్ కలెక్టర్ సూర్యతేజ

పాలకొల్లు సెంట్రల్: ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆ మేరకు ముందుకు సాగాలని నరసాపురం సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ అన్నారు. ఆదివారం పట్టణంలోని విద్యా చైతన్య సమాఖ్య కార్యదర్శి పోలిశెట్టి శ్రీశ్రీ అధ్యక్షతన స్థానిక ఎంఎంకేఎస్ఎం మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించిన ప్రతిభా పాటవ పరీక్షల ప్రశ్నపత్రాలను సబ్ కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ తాను చిన్నతనం నుంచే కలెక్టర్ కావాలనే ఆశయంతో చదివానని, ఆ లక్ష్యమే ఈ రోజు తనను ఈ స్థాయికి చేర్చిందన్నారు. 2040 కల్లా భారతదేశం చోదకశక్తిగా మారనుందన్నారు. పోలిశెట్టి శ్రీశ్రీ మాట్లాడుతూ పదేళ్లుగా ప్రతిభా పాటవ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. పాలకొల్లు డివిజన్ పరిధిలో 7 నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు 550 మంది పరీక్షలకు హాజరయ్యారు. హెచ్‌ఎం అడ్డాల సత్యనారాయణ, సమాఖ్య ఉపాధ్యాయులు తోలేటి గాంధీ, జవ్వాది నాగేశ్వరరావు, మంచెం ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

28న విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల వేదిక

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని విద్యుత్ ఈఈ కార్యాలయంలో ఈనెల 28న ఉదయం 10.30 గంటల నుంచి సీజీఆర్ఎఫ్ చైర్మన్ బి.సత్యనారాయణ, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారుల సమస్యలపై వేదిక నిర్వహించనున్నట్టు విద్యుత్ ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు, బిల్లులో సమస్యలు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, బిల్లుల్లో పేరు మార్పిడి, సరఫరా పునరుద్ధరణలో ఇబ్బందులు, ట్రాన్స్‌ఫార్మర్ మార్పిడి తదితర సమస్యలను లిఖిత పూర్వకంగా తెలియజేయవచ్చన్నారు. అనంతరం మధ్యాహ్నం 2:30 గంటల నుంచి ఉండి రోడ్డులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో విద్యుత్ సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు చెప్పారు.

ఆలయాల అభివృద్ధికి కృషి



భక్తురాలిని సౌకర్యాలపై ఆరా తీస్తున్న ప్రభుత్వ సలహాదారు శ్రీకాంత్

ద్వారకాతిరుమల: హిందూ ఆలయాల అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని రాష్ట్ర దేవదాయశాఖ ప్రభుత్వ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్ అన్నారు. చినవెంకన్న ఆలయాన్ని ఆదివారం ఆయన సందర్శించి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి వేద ఆశీర్వచనాన్ని పలకగా, ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు స్వామివారి మెమెంటో, ప్రసాదాలను అందజేశారు. స్వామి నివేదనశాలను ఆయన పరిశీలించారు. భక్తులతో మాట్లాడి సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ త్వరలో శ్రీకాకుళం జిల్లా నుంచి తన పాదయాత్ర ప్రారంభమవుతుందని, దేవదాయశాఖ పరిధిలోని ఆలయాల స్థితిగతులపై సమీక్షిస్తామన్నారు. పంచాంగకర్తలతో సమావేశం నిర్వహించి మార్గదర్శకాలను రూపొందిస్తామన్నారు. అఖిలభారత బ్రాహ్మణ ఫెడరేషన్ మాజీ ఉపాధ్యక్షుడు వీఎస్ మధుబాబు, బ్రాహ్మణ సంఘ నేత పరిమి సీతారాం, హైందవధర్మ ప్రచార కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యం, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు తోలేటి శ్రీనివాసు, కాశీభట్ల పార్వతీశం తదితరులు ఉన్నారు.



తణుకులో లైసెన్స్‌డ్ ఇంజనీర్ల సమావేశానికి హాజరైన మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

అక్రమ నిర్మాణాలను అరికట్టాలి

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

తణుకు టౌన్: పట్టణాల్లో భవనాలకు సంబంధించి అక్రమ నిర్మాణాలు లేకుండా లైసెన్స్‌డ్ ఇంజనీర్లు జాగ్రత్తలు పాటించాలని పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. స్థానిక చిట్టూరి హెరిటేజ్‌లో ఆదివారం జరిగిన జిల్లా లైసెన్స్‌డ్ స్ట్రక్చరల్ ఇంజనీర్స్ అండ్ ఆర్కిటెక్టర్స్ సంఘ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పట్టణాల్లో నిబంధనల మేరకు భవన నిర్మాణాలు చేపట్టేలా చూడాలని ఆయన కోరారు. తణుకులో లైసెన్స్‌డ్ ఇంజనీర్లకు ప్రత్యేక కమ్యూనిటీ హాలు నిర్మాణానికి కృషిచేస్తామన్నారు. జిల్లా అధ్యక్షుడు వెలగన శ్రీనివాస్ ఆధ్వర్యంలో జిల్లాలో ఇంజనీర్లు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి కారుమూరికి వివరించారు. రాష్ట్ర చైర్మన్ పి.మురళీకృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ శ్రీనివాసకుమార్, సహాయ కార్యదర్శి కె.విజయరామకృష్ణ, జిల్లా కార్యదర్శి జేపీ నాయుడు, గౌరవ అధ్యక్షుడు బి.జానకి రామరాజు పాల్గొన్నారు. మంత్రి కారుమూరిని అసోసియేషన్ తరపున ఘనంగా సత్కరించారు.

రోడ్డు కం రైలు బ్రిడ్జిపై రాకపోకల పునరుద్ధరణ



ఫుట్‌పాత్‌లపై కాంక్రీటు శ్లాబు వేస్తున్న దృశ్యం

కొవ్వూరు: కొవ్వూరు రోడ్డు కం రైలు వంతెనపై ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి వాహన రాకపోకలను పునరుద్ధరించారు. ఫుట్‌పాత్‌లు, హ్యాండ్ రైలింగ్‌ల మరమ్మతుల్లో భాగంగా ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. అత్యవసర మరమ్మతుల నిమిత్తం కేటాయించిన రూ.20 లక్షలతో ఈ పనులు చేపట్టినట్లు ఆర్‌సీఆర్‌బీ డీఈఈ బీవీ మధుసూదనరావు తెలిపారు. రాజమహేంద్రవరం వైపు గతంలో తొలగించిన ఫుట్‌పాత్‌ల స్థానంలో సిమెంటు కాంక్రీటు శ్లాబు వేశామన్నారు. భారీ క్రేన్‌ల సాయంతో కొవ్వూరు వైపు దెబ్బతిన్న ఫుట్‌పాత్‌లను, హ్యాండ్ రైలింగ్స్‌ను పూర్తిగా తొలగించామన్నారు. దిగువన రైల్వేశాఖ నూతనంగా ఐరన్ గడ్డర్లు అమర్చుతోందన్నారు. దెబ్బతిన్న ఫుట్‌పాత్‌లు, హ్యాండ్ రైలింగ్‌లు తొలగించిన ప్రదేశంలో రైల్వే శాఖ గడ్డర్లు అమర్చిన తర్వాత తాము సిమెంటు కాంక్రీటు శ్లాబు వేస్తున్నామన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

దెందులూరు: వేగవరం హేలాపురి ఇంజనీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో జేఎన్‌టీయూ సెంట్రల్ జోన్ క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఆదివారం ప్రగతి ఇంజనీరింగ్ కళాశాల జట్టుపై నరసారావుపేట ఇంజనీరింగ్ కళాశాల జట్టు, డీఎన్నార్ కళాశాల జట్టుపై కిట్స్ మార్కాపురం కళాశాల జట్టు విజయం సాధించాయి. అలాగే హేలాపురి కళాశాల జట్టుపై వీఆర్ సిద్ధార్థ కళాశాల జట్టు, కైట్ కళాశాల జట్టుపై ఆదిత్య కళాశాల జట్టు, గోదావరి కళాశాల జట్టుపై కేకేఆర్ కేఎస్ఆర్ కళాశాల జట్టు గెలుపొందాయి.

ఆక్వాలో యాంటీభయోటిక్స్

- విచ్చలవిడిగా వినియోగం
- పెద్ద ఎత్తున ముడి మందుల సరఫరా
- ఇటీవల తణుకులో వెలుగు చూసిన వ్యవహారం
- చైనా నుంచి అక్రమంగా దిగుమతి!



ఇటీవల తణుకులో వెలుగు చూసిన ముడి మందులు

తణుకు: నిన్నమొన్నటి వరకు మనుషులు వినియోగించే మందుల అమ్మకాల్లో వెలుగు చూసిన వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది. వైద్యుల పర్యవేక్షణలో మాత్రమే వినియోగించాల్సిన అబార్షన్ కిట్లు, వయాగ్రా, నిద్రమాత్రలు విచ్చలవిడిగా మార్కెట్‌లో దొరుకుతున్నాయి. ఔషధ నియంత్రణ శాఖ అధికారులు వీటి మూలాలపై దృష్టి సారించారు. తాజాగా ఆక్వాలో సైతం విచ్చలవిడిగా వినియోగిస్తున్న యాంటీబయోటిక్స్‌పై దృష్టి సారించిన అధికారుల తనిఖీల్లో విస్తుపోయే వాస్తవాలు వెలుగుచూశాయి. తణుకు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ షేక్ అబిద్ ఆలీ ఆధ్వర్యంలో ఇటీవల తణుకులోని ఆక్వా ఫీడ్స్ అండ్ నీడ్స్ దుకాణంలో చేసిన తనిఖీల్లో నిషేధిత యాంటీబయోటిక్స్ మందులను గుర్తించారు. నేరుగా చైనా నుంచి ముడిపౌడర్ రూపంలో దిగుమతి చేసుకుంటున్న అక్రమ వ్యాపారులు హైదరాబాద్, నెల్లూరు కేంద్రంగా రాష్ట్రవ్యాప్తంగా సరఫరా చేస్తున్న వ్యవహారం బయటపడింది.

ఏటా రూ.వందల కోట్ల వ్యాపారం

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా ఆక్వా సాగు విస్తరిస్తోంది. ఇటీవల కాలంలో రైతులు చేపలు, రొయ్యల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఇదే అదనుగా తక్కువ సమయంలో ఎక్కువ దిగుబడి వచ్చేలా రైతులకు కొందరు అక్రమ వ్యాపారులు నిషేధిత యాంటీబయోటిక్స్ మందులను అంటగడుతున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సుమారు 2 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు ఉంది. ఆక్వా రైతుల ఆశలను సొమ్ములు చేసుకునేందుకు వ్యాపారులు నిషేధిత యాంటీబయోటిక్స్ మందులను ముడి పౌడర్ రూపంలో దిగుమతి చేసుకుని యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. దీని ద్వారా ఏడాదికి రూ.వందల కోట్లు ఆర్జిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ, తనిఖీలు లేకపోవడంతో ఫార్మా కంపెనీలకు తరలించాల్సిన మందులను తయారీ కంపెనీల నుంచి పౌడర్ రూపంలో నేరుగా అక్రమంగా దిగుమతి చేసుకుంటున్నారు. ఇందుకు హైదరాబాద్, నెల్లూరు ప్రాంతాల్లోని కొందరు ఏజెన్సీ నిర్వాహకులు సహకరిస్తున్నట్టు తెలుస్తోంది. మరోవైపు జంతువులు, పశువులకు వచ్చే వ్యాధులకు వినియోగించాల్సిన యాంటీబయోటిక్స్ మందులను చేపలు, రొయ్యల సాగులో వినియోగిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది.

పుట్టగొడుగుల్లా ఫీడ్ ఏజెన్సీలు

ఉమ్మడి జిల్లాలో ఆక్వా సాగు ఎక్కువగా ఉన్న భీమవరం, తణుకు, నరసాపుం, పాలకొల్లు, ఆకివీడు, గణపవరం, అత్తిలి, కానూరు, కైకలూరు, ఏలూరు ప్రాంతాల్లో ఫీడ్స్ అండ్ నీడ్స్ ఏజెన్సీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఏజెన్సీలతోపాటు రిటైల్ దుకాణాలకు డ్రగ్ లైసెన్సులు తప్పనిసరి అయినా కొందరు నిబంధనలు ఉల్లంఘిస్తున్నట్లు తెలుస్తోంది. కనీసం ఎలాంటి లైసెన్సులు లేకుండా ఆక్వా, పౌల్ట్రీ మందులను విక్రయిస్తున్నట్టు సమాచారం. ఎంపెడా (మెరైన్ ఎక్స్‌పోర్టు డెవలప్‌మెంట్ అథారిటీ) అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలోనే పెద్ద మొత్తంలో వ్యాపారం చేసే తణుకు పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో పౌల్ట్రీ మందుల ఏజెన్సీ సైతం కొందరు లైసెన్సులు లేని వ్యాపారులకు మందులు సరఫరా చేస్తున్న వ్యవహారం వెలుగుచూసింది. ఇటీవల ఈ ఏజెన్సీపై ఔషధ నియంత్రణ శాఖ అధికారులు తనిఖీలు చేసి అక్రమాలను గుర్తించినట్టు విశ్వసనీయ సమాచారం.

డ్రగ్ లైసెన్స్ తప్పనిసరి



కేవలం ఔషధాల విక్రయాలకే కాకుండా ఆక్వా, పౌల్ట్రీ మందులు విక్రయించే ఏజెన్సీలు, దుకాణాలు సైతం కచ్చితంగా లైసెన్సులు కలిగి ఉండాలి. అయితే లైసెన్సులు లేకుండా మందులు విక్రయిస్తున్నట్లు ఇటీవల తనిఖీల్లో వెల్లడైంది. అంతేకాకుండా నిషేధిత యాంటీబయోటిక్స్ మందులను ముడి పౌడర్ రూపంలో విక్రయిస్తున్నారు. ఇలాంటి వ్యాపారులపై ఇప్పటికే నిఘా పెట్టాం. ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.

– షేక్ అబిద్ ఆలీ, డ్రగ్ ఇన్‌స్పెక్టర్, తణుకు

క్లుప్తంగా

మంత్రి కొట్టుకు కల్యాణోత్సవ ఆహ్వాన పత్రిక అందజేత



మంత్రి కొట్టు సత్యనారాయణకు స్వామివారి జ్ఞాపికను అందిస్తున్న సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీక్షీరారామలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలకు రావాలని కోరుతూ ఉప ముఖ్యమంత్రి, దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణకు ఆహ్వానపత్రిక అందజేసినట్లు ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ఈఓ యాళ్ల సూర్యనారాయణ ఆదివారం చెప్పారు. తాడేపల్లిగూడెంలో క్యాంప్ కార్యాలయంలో మంత్రిని కలిసి స్వామివారి ఆహ్వాన పత్రిక, జ్ఞాపిక అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టీబోర్డు సభ్యులు ఎన్వీఎస్ మధుసూదనరావు, రెల్లి నరసింహారావు, అమలాపురపు జ్యోతి బాలాజీ పాల్గొన్నారు.

17 మంది జూదరుల అరెస్టు

కాళ్ల: కోడి పందేలు నిర్వహిస్తున్న స్థావరంపై దాడి చేసి 17 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఆకివీడు సీఐ గీతారామకృష్ణ చెప్పారు. పెదఅమిరం శివారులో కోడిపందేలు నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేసి నిందితులను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.64,830 నగదు, 5 కోళ్లు, ఒక కారు, 4 బైక్‌లు, 14 సెల్ ఫోన్లు, స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు

నరసాపురం రూరల్: ప్రేమపేరుతో బాలికను వంచించి పలుమార్లు అత్యాచారం చేసిన ఓ యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.విశ్వనాథ్ ఆదివారం చెప్పారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వేములదీవి తూర్పు పంచాయతీ సరుదుకొడపకు చెందిన ఒడుగు లక్ష్మణప్రసాద్, అతనికి సహకరించిన కుటుంబ సభ్యులు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పాత్ర ఏదైనా.. మెచ్చేలా నటన

- వృత్తి సర్కారు కొలువు.. ప్రవృత్తి నాటక రంగం
- కళాకారులు మాదిరెడ్డి, జాగుల నట ప్రస్థానం
- నటీ నట సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో నేడు పాలకొల్లులో సత్కారం
- నేడు ప్రపంచ రంగస్థల దినోత్సవం



సుందరకాండ నాటికలో మాదిరెడ్డి శ్రీనివాసరావు (కోటు వేసుకున్న వ్యక్తి)



సింహాద్రి అప్పన్న నాటకంలో విలన్ పాత్రలో జాగు సత్యనారాయణ

పాలకొల్లు అర్బన్: క్షీరపురి కళారంగానికి ప్రసిద్ధి. చిత్ర పరిశ్రమలోని 24 అంశాల్లోనూ పాలకొల్లు కళాకారుడి పాత్ర వెండి తెరపై వెలుగుతూనే ఉంది. హాస్యనటులు అల్లు రామలింగయ్య, దర్శకరత్న దాసరి నారాయణరావు ఆ స్థాయికి చేరుకోవడానికి మాతృకం రంగస్థలమే. ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా నటీనట సమాఖ్య ఆధ్వర్యంలో రంగస్థలానికి సేవలందిస్తున్న ఇద్దరు కళాకారులను సోమవారం స్థానిక ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో సత్కరించనున్నారు. వీరిలో ఒకరు మాదిరెడ్డి శ్రీనివాసరావు కాగా, మరోకరు జాగు సత్యనారాయణ. వీరు ఓ వైపు సర్కారు ఉద్యోగం చేస్తూనే మరో వైపు కళారంగంపై అభిమానంతో రంగస్థలిపై ఎన్నో ఏళ్లుగా వైవిధ్యమైన పాత్రలు పోషిస్తూ ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఈ కళాకారులు రంగస్థలానికి అందించిన సేవలను ఓ సారి మననం చేసుకుందాం.

పాత్రలకు జీవం పోస్తూ..

భీమవరానికి చెందిన మాదిరెడ్డి శ్రీనివాసరావు.. నరసాపురం జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. కులాల కురుక్షేత్రం, దోచుకోలేనంత ప్రేమ, ఉమెన్ ఇండిపెండెన్స్ డే, సాక్ష్యం, సినీ భారతం, మిస్సింగ్, ప్రేమతో, కలియుగ పంచ పాండవులు, అనుకున్నది ఒక్కటి అయినది ఇంకోకటి, మానవత, పురోహితుడు, చూడచక్కని చిత్రం, కథనం తదితర షార్ట్ ఫిల్మ్‌లో పలు పాత్రలు పోషించి ప్రశంసలు అందుకున్నారు. ప్రముఖ నాటిక రచయిత తాళాబత్తుల వెంకటేశ్వరరావు రచించిన 'నాన్నా నన్ను క్షమించకండి' నాటికను శ్రీకాకుళం పరిషత్ పోటీల్లో ప్రదర్శించి స్పీకర్ తమ్మినేని సీతారామ్ చేతుల మీదుగా ప్రత్యేక బహుమతి పొందారు. అలాగే దిష్టిబొమ్మలు నాటికలో న్యాయవాదిగా రాష్ట్రంలోని అన్ని పరిషత్‌లో ప్రదర్శించారు. బీవీఆర్ కళాకేంద్రం, తాడేపల్లిగూడెం వారి ఆధ్వర్యంలో నవవసంతం, సరస్వతి నమస్తుభ్యం, తస్మాత్ జాగ్రత్త, అల్లూరి సీతారామరాజు నాటకంలో అగ్గిరాజుగా, మళ్లీ మరో జన్మంటూ ఉంటే నాటికలో కోయంబత్తూర్ గణేష్‌గా, అంబేద్కర్ నాటకంలో మరాఠీ రచయిత కేలూస్కర్‌గా, తప్పు ఎవరిది నాటిక, నాన్నా నన్ను క్షమించకండిలో ఎస్సైగా, బంధాలు బరువెంత నాటికలో హీరోగా, గుర్రం జాషువా నాటికలో జాషువా తండ్రిగా, బీబీ నాంచారి నాటికలో మత ప్రవక్తగా నటించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు.



దిష్టిబొమ్మలు నాటికలో న్యాయవాది పాత్రలో మాదిరెడ్డి శ్రీనివాసరావు

విలన్ పాత్రల్లో ఒదిగిపోతూ..

పాలకొల్లుకు చెందిన జాగు సత్యనారాయణ తన 50 ఏళ్ల నట ప్రస్థానంలో వందలాది ప్రదర్శనలు ఇచ్చారు. 1973లో ఎంఎంఎకేఎస్ మునిసిపల్ హైస్కూల్‌లో పది నిమిషాల నాటిక ప్రదర్శన ద్వారా ఆయన తొలిసారి ముఖానికి రంగు పూసుకున్నారు. సినీ దర్శకుడు కోడి రామకృష్ణ రచించిన రథ చక్రాలు నాటికలో, సింహాద్రి అప్పన్న కొండ దిగిరా నాటకంలో విలన్ పాత్రలను చాలా పరిషత్‌లలో ప్రదర్శించి ఉత్తమ విలన్‌గా గుర్తింపు పొందారు. డిగ్రీ చదివే రోజుల్లో కత్తుల రామమోహన్, తాళాబత్తుల వెంకటేశ్వరరావు, నూలి సత్యనారాయణ, ముత్తిరెడ్డి సూర్యారావు, గండేటి వెంకటేశ్వరరావులతో కలిసి త్రివేణి, మంచం మీద మనిషి, రథ చక్రాలు నాటికలు ప్రదర్శించి ప్రేక్షకుల ప్రశంసలు పొందారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఎల్ఎల్‌బీ చదువుతూ 1979లో తొలిసారిగా స్టేజి డైరెక్టర్‌గా ఎంపికయ్యారు. 1981లో ఆంధ్రాబ్యాంక్‌లో ఉద్యోగంలో చేరి 37 ఏళ్లు పనిచేసి అసిస్టెంట్ మేనేజర్‌గా 2016లో ఉద్యోగ విరమణ చేశారు. నాటకంపై మక్కువతో ప్రముఖ సోషల్ వర్కర్ జాన నాగేశ్వరరావు స్థాపించిన నటరాజ కళానిలయం బ్యానర్‌లో దశాబ్దం పాటు ఏడవకండి ఏడవకండి, వర్ధమేథం నాటికలు ప్రదర్శించారు. బళ్ల రాఘవ దర్శకత్వంలో సింహాద్రి అప్పన్న కొండ దిగిరా నాటకంలో విలన్ పాత్ర చేసి ప్రసంశలు పొందారు. నేషనల్ బ్యాంక్ కన్వెన్షన్‌లో స్కిట్స్ ప్రదర్శించి ఉన్నతాధికారుల ప్రశంసలు పొందారు.



'నాన్నా నన్ను క్షమించకండి' నాటికలో హీరో తండ్రి వేషంలో జాగు

వాస్తవికతకు దర్పణం.. 'నాన్నా నేనొచ్చేస్తా'



'ప్రేమతో నాన్న' నాటికలోని ఒక దృశ్యం

తాడేపల్లిగూడెం: పెళ్లంటే సర్దుబాటు.. సంసారం అంటే దిద్దుబాటు అనే విషయాన్ని మహిళలు తెలుసుకుని సంసారాలు సాగించాలనే సందేశాన్ని గుంటూరు అమృతలహరి థియేటర్ ఆర్ట్స్ వారు ప్రదర్శించిన నాన్నా నేనొచ్చేస్తా నాటిక ద్వారా ఇచ్చారు. బీవీఆర్ కళాకేంద్రంలో గడచిన నాలుగురోజులుగా సాగుతున్న జాతీయస్థాయి ఆహ్వాన నాటిక పోటీల సందర్భంగా ఆదివారం సాయంత్రం ప్రదర్శించిన ఈ నాటిక వాస్తవ విషయాలకు దర్పణం పట్టింది. తల్లిదండ్రులు తమ పిల్లలకు చదువు నుంచి పెళ్లి వరకు పిల్లలు అడిగిందల్లా కాదనకుండా ఇచ్చుకుంటూ పోతున్నారు. మితిమీరిన వాత్సల్యం, మమకారాన్ని పెంచుకుని, పోనీలే మన పిల్లలేగా అని స్వేచ్ఛనిచ్చి ఆడపిల్లలను అంతారింటికి పంపితే, వైవాహిక జీవితంలో వచ్చిన మనస్పర్థలను పరిష్కరించుకోలేకపోతున్నారు. మెట్టినింటి నుంచి పుట్టినింటికి నాన్నా...నేనొచ్చేస్తా అంటూ ప్రయాణం చేస్తున్నారు. ఇది సరికాదనే విషయంతో ఈ నాటికను ప్రదర్శించారు.

జీవితం అంటే రాజీ

జీవితం అయ్యినా, సంసారం అయ్యినా రాజీ పడితేనే ముందుకు సాగుతుందనే సందేశాన్ని గుంటూరు జిల్లా కొలకులూరు సాయి ఆర్ట్స్ వారు ప్రదర్శించిన 'ప్రేమతో నాన్న' నాటిక ద్వారా చూపించారు. జీవితం అంటే టెక్కింగ్‌గా భావించిన తండ్రి శశిధర్, మధ్యతరగతి సంపాదనాపరుడైన భర్త అంటే అంతగా ఇష్టంలేని భార్య యశోద. వీరి కూతురు లావణ్య ఈ మూడు పాత్రలమధ్య జరిగే సంఘర్షణకు దృశ్యరూపం ఇచ్చారు. భర్త పెట్టే బాధలు చెప్పుకోడానికి కూతురికి తల్లిదండ్రులు కొంతకాలమే ఉంటారు. జీవితాంతం ఉండరు. రాజీతోనే ముందుకెళ్లాలి అనే సందేశం నాటిక ద్వారా ఇచ్చారు. సమాజంలోని వాస్తవ విషయాలను కథాంశాలుగా తీసుకుని ప్రదర్శించిన ఈ నాటికలు ఆకట్టుకున్నాయి.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు

పెదవేగి : రాట్నాలకుంట గ్రామంలో వేంచేసియున్న శ్రీరాట్నాలమ్మ అమ్మవారిని ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆదివారం ప్రీతికరమైన రోజుకావడంతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన భక్తులు మొక్కుబడులను చెల్లించుకున్నారు. ఈ వారం అమ్మవారికి పూజాటికెట్లపై రూ.30,430, విరాళంపై రూ రూ.41,663, లడ్డూ ప్రసాదం వలన రూ.14,820, ఫొటోల అమ్మకం ద్వారా రూ.2,800 లభించగా, మొత్తం రూ.86,913 ఆదాయం లభించిందని దేవస్థానం చైర్మన్ చల్లగొళ్ల వెంకటేశ్వరరావు, కార్యనిర్వహణాధికారి ఎస్.సతీష్‌కుమార్ చెప్పారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

భీమవరంలో ముగిసిన టెన్నిస్ టోర్నమెంట్

సాక్షి, భీమవరం: పట్టణంలోని కాస్మోక్లబ్‌లో గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న ఆలిండియా టెన్నిస్ టోర్నమెంట్ పోటీలు ఆదివారం విజయవంతంగా ముగిశాయి. పోటీలను క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు అల్లూరి పద్మరాజు, పి.వెంకటరామరాజు, వీవీఎస్ఎస్ వర్మ, కె.రాంబాబు పర్యవేక్షించారు. పోటీల ముగింపు సందర్భంగా సీనియర్ ప్లేయర్ అరిటాకుల చలపతిరావును ఘనంగా సత్కరించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఆయా విభాగాల్లో విజేతల వివరాలిలా ఉన్నాయి. 35+ సింగిల్స్ ఫైనల్స్ విభాగంలో విజయ్ ఆనంద్ (హైదరాబాద్)పై పట్నాయక్ (ఒడిశా) విజయం సాంధించారు. డబుల్స్ విభాగంలో విజయ్‌వర్మ (ఏపీ), గౌతమ్ (ఏపీ)లపై పటాన్నాయక్ (ఒడిశా), విజయ్ ఆనంద్ (హైదరాబాద్) విజయం సాధించారు. అలాగే 45+ సింగిల్స్ ఫైనల్స్‌లో సుబ్రహ్మణియన్ (తమిళనాడు)పై ఎంవీఎల్ఎన్ రాజు (వైజాగ్) విజయం సాధించారు. డబుల్స్ విభాగంలో సుధీర్ రెడ్డి (తెలంగాణ), రమణ (ఏపీ)పై ఎంవీఎల్ఎన్ రాజు (ఏపీ), మణికండన్ (ఏపీ) విజయం సాధించారు. అదేవిధంగా 55+ సింగిల్స్ ఫైనల్స్‌లో సుధాకర్‌రెడ్డి (ఏపీ)పై శ్రీనివాసరెడ్డి (ఏపీ) గెలుపొందారు. డబుల్స్ విభాగంలో శ్రీనివాసరెడ్డి (ఏపీ), మేఘనాథన్ (తమిళనాడు)పై పాల్ మనోహర్ (ఏపీ), శంకర్‌రెడ్డి (ఏపీ) గెలుపొందారు.



ఆలిండియా టెన్నిస్ టోర్నమెంట్‌లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

దుబాయ్‌లో జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

పెనుగొండ: దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించే విధంగా అసెంబ్లీలో తీర్మానం చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ దుబాయ్‌లో దళిత క్రైస్తవ సంఘాలు, వైఎస్సార్ సీపీ నాయకులు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ మేరకు కొడమంచిలికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు తరపట్ల మోహన్ దుబాయ్ నుంచి వివరాలు అందచేశారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న దళిత క్రైస్తవుల చిరకాల కోరికను సీఎం వైఎస్ జగన్ తీర్చడానికి ముందడుగు వేశారన్నారు. సీఎం జగన్ మరోసారి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. అదేవిధంగా ఆచంట నియోజకవర్గం నుంచి మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగానాథరాజు గెలుపు ఖాయమని, అత్యధిక మెజార్టీ సాధించేలా అందరూ అండగా ఉంటామని తెలిపారు. క్షీరాభిషేకం చేసిన వారిలో పాలపర్తి నీలిమ, కాగిత కుమార్, గోసంగి లక్ష్మీ, కొల్లే రవికుమార్, నక్కా ఎలిజబెత్, ఓగూరి శ్రీనివాస్, ఈద శరత్ బాబు, మారుముడి సుధ, నాగమణి, సాగర్, అనిల్ మోక మురళి, నల్లి రామరాజు, గోడి తాడి రమేష్, సునీల్ ఖన్నా, నక్కా శ్రీనుకుమార్ పాల్గొన్నారని తెలిపారు.



దుబాయ్ వెస్ట్ జోన్ సూపర్ మార్కెట్ వద్ద సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, దళిత క్రైస్తవులు

● గడపగడపకు సంక్షేమం



ఇరగవరం: ఓగిడిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు బ్రోచర్ అందించి సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

ముంచుకొస్తున్న రెన్యువల్ గడువు

- ఐదేళ్లకోసారి ప్రైవేట్ ఆసుపత్రులు, ల్యాబ్‌ల రెన్యువల్ తప్పనిసరి
- ఈ నెల 31 లోగా ఆన్‌లైన్‌లో చేయించుకోకపోతే క్రిమినల్ చర్యలు
- జిల్లాలో 363 ప్రైవేట్ ఆస్పత్రులు, ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్లు

భీమవరం(ప్రకాశం చౌక్): పశ్చిమగోదావరి జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రులు, ల్యాబ్‌లు, క్లినిక్‌ల రిజిస్ట్రేషన్‌ను రెన్యువల్ చేయించుకోవడం ఐదేళ్లకోసారి తప్పనిసరి. దీనిలో భాగంగా ఐదేళ్లు పూర్తి చేసుకున్న సంస్థలకు సంబంధించి ఈనెల 31వ తేదీ లోగా రెన్యువల్ చేయించుకోవాల్సి ఉంది. ఇందుకోసం భీమవరంలోని జిల్లా వైద్యాఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో సిబ్బంది ఆన్‌లైన్‌లో రెన్యువల్ చేస్తున్నారు. 2020 సెప్టెంబరు 20 వరకు రెన్యువల్ ప్రక్రియ కాగితాలపైనే జరగగా, 2022 సెప్టెంబర్ 21వ తేదీ నుంచి ఈ ప్రక్రియను ప్రభుత్వం ఆన్‌లైన్ చేసింది. ఈ నేపథ్యంలో గతంలో మ్యాన్యువల్‌గా రెన్యువల్ చేయించుకున్న వారు ఆ సరిఫికెట్‌ను ఆన్‌లైన్ చేసుకోవాలని వైద్యా ఆరోగ్య శాఖ అధికారులు సూచిస్తున్నారు.

ఈ పత్రాలు అవసరం : ఆస్పత్రి లేదా క్లినిక్, ల్యాబ్‌కు సంబంధించి భవనం ప్లాన్, ఫైర్, సెల్ఫ్ అఫిడవిట్, నోటరీ, పొల్యూషన్ సర్టిఫికెట్, వైద్యుల వివరాలు, బెడ్‌ల వివరాలు, సొంత భవనం అయితే పన్ను కట్టిన రశీదు, సౌకర్యాలు తదితర వాటిని రెన్యువల్ చేసే సమయంలో సమర్పించాలి.

రెన్యువల్ చేయించకపోతే.. ఐదేళ్ల రెన్యువల్ గడువు ముగిసి తిరిగి రెన్యువల్ చేయకుండా వైద్య సేవలు అందిస్తే సదరు ఆస్పత్రులు, ల్యాబ్‌లు, క్లినిక్‌ల యాజమాన్యాలపై అధికారులు ఏపీఎంసీఈ చట్టం ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకునే అవకాశాలు ఉన్నాయి. అంతేకాక రెన్యువల్ చేయించుకోకుండా వైద్య సేవలు అందించినప్పుడు రోగులకు చికిత్స వికటిస్తే తీవ్ర నేరంగా పరిగణిస్తారు.



భీమవరం డీఎంహెచ్‌వో కార్యాలయంలో రిజిస్ట్రేషన్ రెన్యువల్ చేయిస్తున్న ఆస్పత్రుల ప్రతినిధులు

జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రులు, ల్యాబ్‌ల వివరాలు

పశ్చిమగోదావరి జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రులు, ల్యాబ్‌లు, క్లినిక్‌లు తదితర 363 రిజిస్ట్రేషన్లు ఇప్పటి వరకు ఉన్నాయి. వీటిలో ఆస్పత్రులు 211, ల్యాబ్‌లు 106, క్లినిక్‌లు 46 ఉన్నాయి. ఇవి కాక స్కానింగ్ సెంటర్లు మరో 121 వరకు ఉన్నాయి.

రెన్యువల్ ఫీజు వివరాలు

ఆస్పత్రి	బెడ్‌ల సంఖ్య	ఫీజు (రూ.ల్లో)
నర్సింగ్ హోమ్	0-20	3,750
	21-50	7,500
	51-100	10,000
	101-200	15,000
	200పైన	37,500
సాధారణ క్లినిక్		1,250
పాలి క్లినిక్		2,500
ల్యాబ్/స్కానింగ్ సెంటర్/ ఫిజియోథెరపి/సాధారణ ల్యాబ్		2,500
పరికరాలు ఎక్కువగా ఉంటే		10,000
ఫిజియోథెరపి యూనిట్		3,750
అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్		25,000
జెనిటిక్ కౌన్సెలింగ్ స్కానింగ్ సెంటర్		35,000

ఈ నెలాఖరులోగా రెన్యువల్ చేసుకోవాలి



జిల్లాలో ఐదేళ్లు పూర్తి చేసుకున్న ఆస్పత్రులు, ల్యాబ్‌లు, క్లినిక్‌ల రిజిస్ట్రేషన్లను ఈ నెలాఖరులోగా రెన్యువల్ చేయించుకోవాలి. రెన్యువల్ చేయకుండా వైద్య సేవలు అందిస్తే చట్ట ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకుంటాం. అన్ని పత్రాలు అందుబాటులో ఉంచుకుని ఆన్‌లైన్ ద్వారా మాత్రమే రెన్యువల్ చేసుకోవాలి. రెన్యువల్‌కు సంబంధించి మరింత సమాచారం తెలుసుకోవడానికి జిల్లా వైద్యా ఆరోగ్య శాఖ కార్యాలయంలో సిబ్బందిని అడిగి తెలుసుకోవాలి.

– డాక్టర్ డి.మహేశ్వరరావు, డీఎంఅండ్‌హెచ్ఓ, భీమవరం

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ఇరగవరం: సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం అని రాష్ట్ర పౌరసరఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు, అన్నారు. ఆదివారం ఇరగవరం మండలం ఓగిడి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి పదవి చేపట్టినప్పటి నుంచి రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. గతంలో టీడీపీ అనుచరులు మాత్రమే లబ్ధి పొందేవారని అన్నారు. ఇప్పుడు అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్నామన్నారు. దానికి నిదర్శనం గ్రామంలోని టీడీపీ నాయకుడు కానూరి గంగాచలం కుటుంబానికి ఇప్పటి వరకు రూ.8 లక్షల లబ్ధి చేకూరిందని ఆయనకు వివరించారు. అందరికీ సంక్షేమ పథకాలు అందించే మనస్సున్న వ్యక్తి సీఎం వైఎస్ జగన్ అన్నారు. ప్రతి ఒక్కరి ఇంటికి వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పథకాల ద్వారా పొందిన లబ్ధి వివరాలతో కూడిన బ్రోచర్‌ను అందించి లబ్ధిదారులతో మాట్లాడారు. శ్మశాన వాటికలో విద్యుత్ స్తంభం లేక అంత్యక్రియలకు ఇబ్బంది పడుతున్నామని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ప్రజలు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఆయన విద్యుత్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామానికి చెందిన ఇద్దరు పేద దివ్యాంగులు వివాహం చేసుకున్నారు. మంత్రి కారుమూరి ఆ జంటకు రూ.10 వేలు అందించి, వారు ఉండేందుకు ఉచితంగా ఇల్లు నిర్మిస్తానని హామీ ఇచ్చారు. రూ.19 లక్షల నిధులు విలువ చేసే సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేశారు ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పంపన అంజిబాబు, ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగతాయారు, మండల పార్టీ అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, సర్పంచ్ ఘంటా సురేఖ, ఎంపీటీసీ మారుమూడి భారతీ, నాయకులు ఘంటా అప్పారావు, చోడే జోషి, దినేష్ రెడ్డి, ఖండవల్లి మధుబాబు, పిల్లి రాంబాబు, సాపాటి సూర్యనారాయణ, కొండవీటి శ్రీను, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.


ఓగిడిలో స్థానిక ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి కారుమూరి

నేడు అత్తిలిలో మంత్రి కారుమూరి పర్యటన

అత్తిలి: రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు సోమవారం అత్తిలిలో నిర్వహించనున్న పలు కార్యక్రమాలకు హాజరవుతారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ తెలిపారు. సోమవారం మధ్యాహ్నం అత్తిలి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మండపంలో వైఎస్సార్ ఆసరా పథకం నగదు విడుదల కార్యక్రమంలో మంత్రి కారుమూరి పాల్గొంటారని చెప్పారు. అనంతరం జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరవుతారని, అనంతరం రామన్నపేటలో పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో మంత్రి కారుమూరి నాగేశ్వరరావును సన్మానిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమాలలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని సత్యనారాయణ కోరారు.

ఔషధ నియంత్రణ అధికారులకు కలెక్టర్ ప్రశంసలు


అధికారులను అభినందిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

తణుకు: జిల్లాలో నిబంధనలకు వ్యతిరేకంగా, లైసెన్స్ లేకుండా మందులు నిల్వలపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించినట్లు తణుకు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ షేక్ అబిద్‌అలీ తెలిపారు. శనివారం భీమవరం కలెక్టర్ కార్యాలయంలో ఔషధ నియంత్రణ శాఖ ఏడీ విజయ్‌కుమార్‌తోపాటు తణుకు, భీమవరం డ్రగ్ ఇన్‌స్పెక్టర్లతో ఆమె సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారని చెప్పారు. ఇటీవల అనధికార మందుల నిల్వలు, అనుమతులు లేకుండా విక్రయాలపై దాడులు నిర్వహించిన తణుకు, భీమవరం డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు షేక్ అబిద్‌అలీ, మల్లికార్జునరావును కలెక్టర్ అభినందించారన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం, అమ్మకాలపై, ఆక్వాలో యాంటీ బయోటిక్స్ వినియోగంపై నిఘా ఉంచాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఎస్పీ రవిప్రకాష్ మాట్లాడుతూ ఔషధ నియంత్రణ శాఖ అధికారులకు పోలీసు శాఖ సహకారం ఉంటుందని చెప్పారని అబిద్‌అలీ వెల్లడించారు.

క్లుప్తంగా

ముత్యాలమ్మ వెండి చీర తయారీకి విరాళాలు


ముత్యాలమ్మ వారి వెండి చీర నిమిత్తం విరాళాలు అందజేస్తున్న భక్తులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ముత్యాలంబపురం ముత్యాలమ్మవారి వెండి చీర నిమిత్తం దాతల విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో ఉప్పాకపాడు గ్రామానికిచెందిన మాకా శ్రీనివాస్, కుందురెడ్డి దుర్గారావు (బోడపాడు) రూ.10,116 చొప్పున, కామిశెట్టి మురళీకృష్ణ (పడాల) కిలో వెండిని విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు వేదాశీస్సులు అందజేశారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మాకా బాలాజీ, ఆలయ కార్యనిర్వహణాధికారి పి.హరేరాంప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ హరిబాబు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కుల పంపిణీ

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం మండలానికి సంబంధించి వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పట్టణంలోని మాగంటి కల్యాణ మండపంలో సోమవారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వెలిశెట్టి నరేంద్రకుమార్ తెలిపారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఈ కార్యక్రమంలో పాల్గొని మూడో విడత చెక్కును పంపిణీ చేస్తారని, అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

సీపీఐ పట్టణ కార్యదర్శిగా మండల నాగేశ్వరరావు



తాడేపల్లిగూడెం (టీఓసీ): సీపీఐ పట్టణ కార్యదర్శిగా మండల నాగేశ్వరరావు ఎంపికయ్యారు. పట్టణంలోని కపర్థి భవనం సీపీఐ కార్యాలయంలో ఆదివారం సీపీఐ ఏరియా విస్తృత కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. కౌన్సిల్ సభ్యులుగా తాటికొండ గంగా భవాని, వడ్డాది మేరీ, దాస్యం రాము, నాగరాజు, నాగలక్ష్మి, అల్లం నరేంద్ర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రూరల్ మండల కార్యదర్శిగా ఉల్లింకల జయకృష్ణ, మండల సమితి సభ్యులుగా కర్రి సోమేశ్వరరావు, సీహెచ్ భాస్కర్, ఉల్లింకల బాలకృష్ణ, భవాని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సీతారాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. నూతన సభ్యులకు పలువురు అభినందనలు తెలిపారు.

నేడు గణపతి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ శంకుస్థాపన

తాడేపల్లిగూడెం రూరల్: కడియద్ద గ్రామంలో గణపతి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి సోమవారం ఉదయం 8.14 గంటలకు శంకుస్థాపన చేయనున్నట్లు ఆహ్వాన కమిటీ సభ్యులు తెలిపారు. రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

పోటీతత్వంతో చదవాలి

పోడూరు: విద్యార్థులు పోటీతత్వంతో చదవాలని ఎమ్మెల్సీ షేక్ సాబ్జి పిలుపునిచ్చారు. యూటీఎఫ్ మండలశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 5న 5, 10 తరగతుల విద్యార్థులకు నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో విజేతలకు కవిటం జెడ్పీ హైస్కూల్లో బహుమతులు అందజేశారు. బహుమతి ప్రధానోత్సవంలో ఎమ్మెల్సీ సాబ్జి ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు అందజేశారు. పేదరిక నిర్మూలనకు చదువు ఎంతో కీలకమని ఆయన అన్నారు. తల్లిదండ్రులంతా తమ పిల్లలను ఉన్నతచదువులు చదివించాలన్నారు. జెడ్పీఫ్లోర్ లీడర్ గుంటూరి పెద్దిరాజు, ఎంపీపీ సబ్బితి సుమంగళి, దాసరి క్షేమమూర్తి, కేతా నాగరాజు, ఆచంట ఏఎంసీ ఛైర్‌పర్సన్ చిల్లే లావణ్య, వైస్‌ఛైర్మన్ గుబ్బల వీరబ్రహ్మం, సర్పంచ్ చుట్టుగుల్ల పూర్ణిమ, ఎంపీటీసీ సభ్యుడు కుక్కల సూర్యనారాయణ, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు పీఎస్ విజయరామరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి నిధుల మంజూరు

పెనుమంట్ర: వెలగలేరు గ్రామానికి చెందిన శ్రీపార్వతి రామలింగేశ్వరస్వామి ఆలయ పునఃనిర్మాణానికి దేవాదాయశాఖ రూ. 2 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు దేవస్థానం ఈఓ కె.జానకిరామరాజు తెలిపారు. లో లెవల్‌లో ఉన్న శిథిలావస్థకు చేరుకుంటున్న ఈ దేవాలయాన్ని పునర్నిర్మించేందుకు గ్రామస్తులు రూ.50 లక్షలు విరాళాలు సేకరించడంతో దేవాదాయశాఖకు కంట్రిబ్యూషన్ చెల్లించడంతో స్థానిక శాసన సభ్యులు చెరుకువాడ శ్రీరంగనాథరాజు కృషితో దేవాదాయశాఖ రూ. 2 కోట్లు నిధులు మంజూరు చేసిందని ఆయన తెలిపారు. త్వరలో ఈ ఆలయాన్ని పునర్నిర్మించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు, సొసైటీ మాజీ అధ్యక్షుడు కొవ్వూరి పుత్రారెడ్డి తెలిపారు. ఈ ఆలయం పునర్నిర్మాణం వందేళ్ల క్రితం జరిగిందని, పరిసర ప్రాంతాల్లో రోడ్లు ఎత్తుకావడంతో ఆలయం లో లెవల్‌లో ఉంది. గ్రామస్తుల కోరిక మేరకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని ఆయన తెలిపారు.

భళా... నృత్యహేల


జాతీయ నాటిక పోటీల వేదికపై నృత్యం చేస్తున్న చిన్నారులు





ఆకట్టుకున్న చిన్నారులు

తాడేపల్లిగూడెం: జానపద జావళిల నృత్య విన్యాసాలతో చిన్నారులు వేదికకు సంపూర్ణత్వం తెచ్చారు. బాలికలు తమ ప్రతిభతో శాస్త్రీయ నృత్య రీతుల సోయగాల అలరించారు. బాలలంతా వివిధ నృత్య రీతులతో అలరించి అబ్బురపర్చారు. బీవీఆర్ కళాకేంద్రంలో జాతీయ ఆహ్వాన నాటిక పోటీలను పురస్కరించుకొని బాలలు ప్రదర్శించిన నృత్యాలు ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేశాయి. ఒక్కరుగా, బృందంగా పద విన్యాసాలకు అనుగుణంగా పాదాలు కదిపి శభాష్ అనిపించుకున్నారు. కళాకేంద్రం వ్యవస్థాపకుడు బుద్దాల వెంకటరామారావు, శ్రీ డ్యాన్సు అకాడమీ బాధ్యులు ఆళ్ల శ్రీనివాసు, రవళి పర్యవేక్షించారు.

బుద్దాల సేవలు అభినందనీయం


కళాకారులను సన్మానిస్తున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్ : బీవీఆర్ కళాకేంద్రం వ్యవస్థాపకుడు బుద్దాల వెంకటరామారావు చేస్తున్న కళాసేవలు అభినందనీయమని ఉపముఖ్యమంత్రి, దేవదాయ ధర్మదాయ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ కొనియాడారు. స్థానిక బీవీఆర్ కళాకేంద్రంలో ఉగాదిని పురస్కరించుకొని ఈనెల 22 నుంచి 27వ తేదీ వరకు నిర్వహిస్తున్న జాతీయస్థాయి నాటికల పోటీలు, నృత్యోత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఉగాది ఉత్సవాల్లో జాతీయస్థాయిలో విశిష్ట వ్యక్తులను గుర్తించి సన్మానించడం అభినందనీయమన్నారు. 30 ఏళ్ల నుంచి బుద్దాల వెంకటరామారావు ఉగాది ఉత్సవాలను క్రమం తప్పకుండా నిర్వహించడం గొప్ప విషయమన్నారు. జాతీయస్థాయిలో నాటకోత్సవాలను బీవీఆర్ కళాకేంద్రంలో నిర్వహించడం తాడేపల్లిగూడెం పట్టణానికే గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా విజయవాడకు చెందిన జానపద కళారత్న దామోదర గణపతిరావు, శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఉపాధ్యాయుడు కుంభ శ్రీరామ శేషశాస్త్రి, ఎన్‌టీఆర్ కళాపరిషత్ కాట్రగడ్డ రాంప్రసాద్, దండు భాస్కరరావు, చిట్టి వెంకట్రావును ఉప ముఖ్యమంత్రి చేతుల మీదుగా సత్కరించారు. అనంతరం ఉపముఖ్యంత్రి కొట్టు సత్యనారాయణను దుశ్శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీవీఆర్ కళాకేంద్రం వ్యవస్థాపకుడు బుద్దాల వెంకటరామారావు, పీటీ వెంకన్న, పేరిచర్ల మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక కైలాస గౌరీ నోములు

తణుకు టౌన్: వాసవి క్లబ్ ఇంటర్నేషనల్, వాసవి వనితా వైభవం, వాసవి క్లబ్ ఆఫ్ రాయల్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక కైలాస గౌరీ నోములు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఆదివారం తణుకులోని ఆర్యవైశ్య సేవా భవనంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తణుకు పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు 600 మంది మహిళలకు పసుపు కుంకుమలను పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ముందుగా వాసవి మాతకు పూజలు నిర్వహించి అనంతరం సామూహిక కైలాస గౌరీ నోములు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో వాసవీ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ కొర్లేపర కృష్ణాజీ దంపతులు, వైస్ గవర్నర్ కేదారిశెట్టి రవికుమార్ దంపతులు, జోన్ ఆఫీసర్ గుడిమెట్ల రాజేశ్వరరావు, వాసవి వనితా వైభవం క్లబ్ అధ్యక్షురాలు ఆకుల వేదకుమారి, కార్యదర్శి జల్లూరి సుజాత, కోశాధికారి గూడూరు గీత, వాసవి క్లబ్ ఆఫ్ రాయల్స్ అధ్యక్షుడు జవ్వాది భద్రయ్య, కార్యదర్శి కందుల చంద్రమౌళి, కోశాధికారి కట్టమూరి మురళీతో పాటు ఆయా క్లబ్ సభ్యులు, పాల్గొన్నారు.


సామూహిక కైలాస గౌరీ నోములలో మహిళలకు పసుపు, కుంకుమల పంపిణీ

మహిళా విద్యకు సుబ్బారావు కృషి

తణుకు టౌన్: తణుకు ప్రాంతంలో మహిళా విద్య, సాధికారతకు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల వ్యవస్థాపకుడు చిట్టూరి సుబ్బారావు విశేష కృషి చేశారని కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి చెప్పారు. ఆదివారం చిట్టూరి సుబ్బారావు జయంతి సందర్భంగా కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల అభివృద్ధికి సుబ్బారావు చేసిన సేవలను కొనియాడారు. ఈకార్యక్రమంలో కళాశాల చైర్మన్ కోమట్లపల్లి వెంకట సుబ్బారావు, కోశాధికారి నందిగం సుధాకర్, జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకట సుబ్బారావు, పాలకవర్గ సభ్యురాలు రీనాసాయి, పలువురు పుర ప్రముఖులు, ఎస్‌కేఎస్‌డీ విద్యా సంస్థల ప్రిన్సిపాల్స్, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

అత్తిలి: లయన్స్‌క్లబ్ ఆఫ్ అత్తిలి ఆధ్వర్యంలో, పాలకొల్లు ఆర్‌ఆర్ లయన్స్ ఆసుపత్రివారి సహకారంతో సోమవారం మంచిలి గ్రామంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు పట్నాల వెంకటేశ్వరరావు ఆదివారం విలేకరులకు తెలిపారు. మంచిలిలో భగవాన్ పూతరేకుల భవనం వద్ద శిరగాని నాగేశ్వరరావు ఆర్థిక సహకారంతో నిర్వహించే నేత్ర వైద్యశిబిరంలో అవసరమైన వారికి ఉచితంగా మందులు, కళ్లజోళ్లు ఇస్తారని, శస్త్రచికిత్సలు చేస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రెండు నెలల్లో రోడ్ల అభివృద్ధి పనులు పూర్తి

ఇరగవరం: మరో రెండు నెలల్లో నియోజకవర్గంలోని అన్ని రోడ్ల అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని రాష్ట్ర పౌర సరఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ఇరగవరం మండలంలోని అయినపర్రులో రూ. 40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, 17.50 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ క్లినిక్, చెరువు దగ్గర నిర్మించిన వాకింగ్ ట్రాక్ మొత్తం రూ.87.50 లక్షలతో పూర్తి చేసిన అభివృద్ధి పనులకు ఆయన ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత గతంలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమం, అభివృద్ధిలో రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముందుకు తీసుకువెళుతున్నారన్నారు. అందులో భాగంగా దాతల సహకారంతో గ్రామంలో రైతు భరోసా, వాకింగ్ ట్రాక్, విలేజ్ క్లినిక్, సచివాలయ భవనాలు నిర్మించుకోవడం అభినందనీమని పేర్కొన్నారు. ఈ భవన నిర్మాణాలకు స్థలాలు ఇచ్చిన దాతలను అభినందించారు. సర్పంచ్ సత్తి అఖిల, ఎంపీటీసీ సత్తి లీలాప్రసన్న, సత్తి వెంకట రెడ్డి, సత్తి శ్రీరామచంద్రారెడ్డి, వెంకట రామారెడ్డి, స్థల దాతలు వెలగల పెద అమ్మిరెడ్డి, కర్రి వెంకట రామారెడ్డి, వెలగల భేతిరెడ్డి సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.


అయినపర్రులో సచివాలయ భవనం ప్రారంభిస్తున్న మంత్రి కారుమూరి

వాకర్స్ గ్రౌండ్‌లో స్వచ్ఛ భారత్

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎయిర్ స్ట్రిప్ వాకర్స్ అసోసియేషన్ వన సంరక్షణ గ్రౌండ్‌లో ఆదివారం వాకర్స్ అధ్యక్షుడు కురుమళ్ల వెంకటాచలం నేతృత్వంలో స్వచ్ఛ భారత్ నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రం చేసి, చెత్త చెదారాలను తొలగించారు. వెంకటాచలం మాట్లాడుతూ వాకింగ్ చేసే వారు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు సహకరించాలన్నారు. ప్రధాన కార్యదర్శి పి.కుమారస్వామి, కోశాధికారి పోతినీడి వెంకట పరమాత్మ, డిప్యూటీ గవర్నర్ ప్రవా శ్రీనివాస్, మాకా శ్రీనివాసరావు, ఏఆర్‌కే సత్యనారాయణ, రాగిరెడ్డి ప్రసాద్, కె.లక్ష్మీనరసింహం పాల్గొన్నారు.


స్వచ్ఛ భారత్ కార్యాక్రమంలో వాకర్స్ సభ్యులు

సంచార వైద్యశాలతో వృద్ధులకు వైద్య సేవలు

తణుకు టౌన్: తణుకులోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సంచార వైద్యశాల ద్వారా ప్రతి ఆదివారం నిర్వహించే ఉచిత వైద్య శిబిరంలో భాగంగా ఆదివారం తణుకులో సంధ్యా జ్యోతి వృద్ధాశ్రమంలోని 40 మంది వృద్ధులకు ఆశ్రమం వద్దకే వెళ్లి వైద్య సేవలందించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఏ కరుణాకర్ చౌదరి తెలిపారు. ఆదివారం సంచార వైద్యశాల ద్వారా ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, జనరల్ వైద్యులు బొండాడ వెంకటేశ్వర్లు ఆశ్రమం వద్దకు వెళ్లి ఆశ్రమం ఉన్న వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. మండపాక గ్రామానికి చెందిన కొడమంచిలి సుబ్బలక్ష్మి పేరున ఆమె భర్త గోపాల కృష్ణ మూర్తి అందించిన ఆర్థిక సహాయంతో ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకురాలు చిట్టూరి సుజాత, అసోసియేషన్ కార్యదర్శి కేవీ సత్యనారాయణ, కోశాధికారి ఆర్జి భాస్కరరావు పాల్గొన్నారు.


తణుకు సంధ్యా జ్యోతి వృద్ధాశ్రమంలో వృద్ధులకు వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

బాల్య వివాహాన్ని అడ్డుకున్న సీడీపీఓ

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని పాతూరు 12వ వార్డు సంజీవనగర్‌లో ఆదివారం రాత్రి ఓ ఇంటి వద్ద నిర్వహిస్తున్న బాల్యవివాహాన్ని సీడీపీఓ టి.లక్ష్మీసరస్వతి ఆధ్వర్యంలో సూపర్‌వైజర్లు సీహెచ్ దుర్గాభవాని, టి.వెంకటలక్ష్మి, డి.సుజాత, ఆర్.ఎస్తేర్‌రాణి సంయుక్తంగా వెళ్లి అడ్డుకున్నారు. పాతూరుకు చెందిన 32 ఏళ్ల అబ్బాయికి, పడాల గరువుకు చెందిన 13 ఏళ్ల బాలికకు మైనార్టీ తీరకుండా వివాహం చేస్తున్నారు. ఛైల్డ్ లైన్ 1098 ద్వారా వచ్చిన సమాచారం మేరకు అధికారులు వెళ్లి ఈ వివాహాన్ని అడ్డుకుని ఇరుపక్షాల వారితో మాట్లాడారు. లిఖిత పూర్వకంగా వివాహాన్ని రద్దు చేసుకున్నట్లు అంగీకార పత్రాలు తీసుకున్నారు. ఐసీడీఎస్, రెవెన్యూ, అంగన్‌వాడీ, పోలీస్ సిబ్బంది, జీఎంఎస్‌కే సిబ్బంది హాజరయ్యారు. లక్ష్మీసరస్వతి మాట్లాడు తూ మైనార్టీ తీరకుండా వివాహం చేసుకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు.

మానవత సేవలు విస్తృతం చేయాలి

పెంటపాడు: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు గ్రామీణ ప్రాంతాల్లో విస్తరించడంతో పాటు, సభ్యత్వాల సంఖ్యను గణనీయంగా పెంచేందుకు ప్రతి సభ్యుడు కృషి చేయాలని మానవత జిల్లా విద్యా కమిటీ చైర్మన్ తాడేపల్లి మోహనరావు పేర్కొన్నారు. పెంటపాడు మండల మానవత సంస్థ సమావేశం ఆదివారం పెంటపాడులోని విశ్రాంత బ్యాంక్ మేనేజర్ తాడేపల్లి మోహనరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మండల శాఖ అధ్యక్షుడు గంపా కృష్ణమోహన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో మండలంలో ఇప్పటివరకు మానవత ఆధ్వర్యంలో చేసిన సేవాకార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. మానవత కెరీర్ గైడెన్స్ ఆధ్వర్యంలో సుమారు 20 కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు అవగాహనలు కల్పించడంలో తాడేపల్లి మోహనరావు కృషిని పలువురు కొనియాడారు. ఎంతో మంది విద్యార్థులు విద్యా గైడెన్స్ కార్యక్రమాన్ని ఉపయోగించుకున్నారని అన్నారు. మోహనరావు మాట్లాడుతూ మండలంలో ప్రతి గ్రామంలో సభ్యులను మానవతలో చేర్పించాలన్నారు. మానవతను ప్రతి ఒక్కరూ ఆదరించాలన్నారు. కార్యదర్శి నల్లమిల్లి ప్రభాకరరెడ్డి, ట్రెజరర్ ఏలూరి వీరాస్వామి, సభ్యులు తారాడి పాల్, కుదుళ్ల నారాయణరావు, జార్జి, కాకర్ల జయరాజు పాల్గొన్నారు.


పెంటపాడులో మానవత సంస్థ సమావేశంలో పాల్గొన్న మోహనరావు, మండల కమిటీ సభ్యులు

వైభవంగా బోనాల పండుగ


బోనాలతో ఊరేగింపుగా వెళుతున్న భక్తులు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని రెల్లిపేటలో కొలువై ఉన్న శ్రీ వడ్డిపోలమాంబ, కుంచమాంబ అమ్మవార్ల జాతర మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. రెల్లికుల సంక్షేమ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో ఈ నెల 12న ప్రారంభమైన ఈ ఉత్సవాల్లో రోజుకో కార్యక్రమం చొప్పున అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం అమ్మవార్లకు బోనాలు పండుగ నిర్వహించారు. సుమారు 500 మంది పైగా మహిళలు అమ్మవార్లకు పాయసం నైవేద్యంగా తయారు చేసి బోనాలు నెత్తిన పెట్టుకుని తీన్మార్ వాయిద్యాలతో పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం పట్టణ పొలిమేర అయిన నరసాపురం రోడ్డులో అయ్యప్పస్వామి ఆలయం వరకూ వెళ్లి ఉత్సవ ఊరేగింపును ముగించారు. ఏప్రిల్ 25 వరకూ జాతర ఉత్సవాలు నిర్వహిస్తామని కమిటీ సభ్యులు ధనాల శ్రీనివాసు తెలిపారు.